ప్రజాశక్తి
శుక్రవారం 9 ఫిబ్రవరి 2024 5 విజయనగరం



కోలుకున్న ఇంజినీరింగ్ విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

గురజాడ జెఎన్‌టియు విశ్వవిద్యాలయంలో బుధవారం కలుషిత ఆహారం తిని అస్వస్థతకుగురై సర్వజన ఆస్పత్రిలో చేరిన విద్యార్థులు కోలుకొని కళాశాలకు చేరుకున్నారు. మధ్యాహ్నం భోజనం నూనె , పులిసిన పెరుగు తిన్న కొందరు విద్యార్థులకు వాంతులు, విరోచనాలు రావడంతో అస్వస్థతకు గురయ్యారు. వీరిని వెంటనే సార్వజన ఆసుపత్రికి కళాశాల సిబ్బంది తరలించారు. అదే రోజు రాత్రి భోజనం చేసి మరో 8మంది విద్యార్థులు అస్వస్థత గురి కావడంతో రాత్రి సుమారు 10 గంటల సమయంలో వీరిని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. వీరంతా కోలుకోవడంతో గురువారం కళాశాలకు వెళ్లిపోయారు. కళాశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురికావడం ఇది రెండోసారి. 2022 సెప్టెంబర్ 6న మెస్ లో ఆహారం తిని 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. జెఎన్‌టియు విద్యార్థులు పలుమార్లు వసతి గహంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రోడ్డెక్కారు. అయినా కళాశాల ప్రిన్సిపల్, యాజమాన్యం పట్టించుకోక పోవడంతో మళ్లీ అటువంటి సంఘటనే పునరావృతమైంది. కళాశాలలోను, హాస్టల్‌లోను వసతులు మెరుగుపర్చాలని విద్యార్థులు కోరుతున్నారు.

11 గ్రామాల్లో ఉపాధికి గండి

ఉపాధి పనులకు నోచని చెరువు

- 2,871 కుటుంబాలకు అవస్థలు
- ఆయా పంచాయతీలకు ఎల్‌జిడి రూపొందించకపోవడమే కారణం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అసలే వలసలు ఎక్కువగా ఉన్న జిల్లా.... ఆపై నూతనంగా ఏర్పాటైన పంచాయతీలకు ఎల్‌జిడి (లోకల్ గవర్నమెంట్ డైరెక్టరేట్) కోడ్‌ను రూపొందించకపోవడంతో గ్రామీణ జాతీయ ఉపాధి హామీ ఆయా గ్రామాలకు దూరమైంది. దీంతో, ఆయా గ్రామాల్లో వేలాది కుటుంబాలు జీవనోపాధి కోల్పోయాయి. మూడు నెలలుగా ఉపాధి పనులు దొరక్క అవస్థలు పడుతున్నారు. విజయనగరం జిల్లాలోని పలు గ్రామ పంచాయతీలకు అనుసంధానంగా వున్న 11 మధుర గ్రామాలను ఇటీవల ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. ఆయా పంచాయతీల ఎల్‌జిడి కోడ్ ఆధారంగానే ప్రభుత్వ పథకాల ప్రతిపాదనలు లేదా ఇతర డిమాండ్స్‌లు పంపడం లేదా ప్రభుత్వం మంజూరు చేయడం వంటి కార్యకలాపాలు జరుగుతాయి. దీన్ని రాష్ట్ర స్థాయిలో సిసిఎల్ఎ విభాగం కేటాయించాల్సివుంటుంది. నెలలు తరబడి కోడ్‌ను కేటాయించకపోవడంతో ఉపాధి పనుల ప్రతిపాదనలు పంపడం సాధ్యం కావడం లేదని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా ఎల్‌జిడి కోడ్ ఎంటర్ చేస్తే తప్ప ఎన్ఐసి సాఫ్ట్‌వేర్‌లో ముందుకు నడిచే పరిస్థితి లేదని చెబుతున్నారు. ఈ కారణంతో గడిచిన మూడు నెలలుగా ఆయా పంచాయతీల్లో ఉపాధి పనులు మూడు నెలలుగా జరగడం లేదు. ఇలాంటి సమస్య ఉన్నవాటిలో మెరకముడిదాం మండలం నరసయ్యపేట, ఎం.గదబవలస, గుర్ల మండలం ముద్దాడపేట, రౌతుపేట, కేశవుపేట, నెల్లిమర్ల మండలం పెదబూరాడపేట, మెంటాడ మండలం చింతాడివలస, విజయనగరం మండలం బడుకొండపేట, సుంకరపేట, గుండాలపేట, చిల్లపేట ఉన్నాయి. ఈ గ్రామాల పరిధిలో సుమారు 2,871 జాబ్‌కార్డులు ఉన్నాయి. ఉపాధి పనులు దొరక్కపోవడతో ఆర్థికంగా ఆయా కుటుంబాలన్నీ ఇబ్బంది పడుతున్నాయి. పండగ తరువాత ఉపాధి పనికి పోదమనుకుంటే ఏవో సమస్యలు ఉన్నాయంటూ పని కల్పించడం లేదని కేశవపేటకు చెందిన కొవ్వాడ దేవి, దొంతల రమణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి రెండో వారం వరకూ వ్యవసాయ పనులు ఉండడంతో ఉపాధి పనుల అవసరం పెద్దగా లేకపోయిందని, ఆ పనులు పూర్తికావడంతో ప్రస్తుతం ఉపాధి పనులే దిక్కని రైతుపేట గ్రామానికి చెందిన గేదెల సీతంనాయుడు, గేదెల పైడినాయుడు, రౌతు తిరుమలరావు ఆవేదన వ్యక్తం చేశారు.

సమస్యలు తొలగుతాయనుకుంటే..

ప్రత్యేక పంచాయతీగా గుర్తింపు పొందడంతో చిటికీ మాటికీ పక్కూరు వెళ్లక్కరలేదని, ప్రభుత్వ పథకాలు కూడా మరింత అందుబాటులోకి వస్తాయని భావిస్తే మరింత జఠిలమయ్యాయి. గుర్తింపు లేని పంచాయతీలు ఎందుకు? పాలకుల నిర్లక్ష్యం తమను ఉపాధి పనులకు కూడా దూరం చేసింది. వ్యవసాయ పనులు లేక, ఇటు ఉపాధి పనులు దొరక్క ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.

- పెనుమజ్జి అప్పలనారాయణ, నర్సయ్యపేట సర్పంచ్, మెరకముడిదాం మండలం

సిసిఎల్ఎ కమిషనర్‌కు డిఒ లెటర్

ఇప్పటికే సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. పంచాయతీలకు ఎల్‌జిడి (లోకల్ గవర్నమెంట్ డైరెక్టరేట్) కోడ్ విషయమై సిసిఎల్ఎ కమిషనర్‌కు, పంచాయతీరాజ్ కమిషనర్‌కు కలెక్టర్ డిఒ లెటర్ కూడా రాశారు. పనులు పునరుద్ధరించే ఏర్పాటు చేయాలంటూ ఆయా పంచాయతీలకు చెందిన ఉపాధి కూలీలనుంచి విజ్ఞప్తులు వస్తున్నాయి.

ఉమాపరమేశ్వరి, డ్వామా పీడీ, విజయనగరం జిల్లా

మిమ్స్ ఉద్యోగుల ర్యాలీ

- న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని

ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మిమ్స్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మిమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఉద్యోగులు గురువారం ర్యాలీ, మానవహారం చేపట్టారు. సమస్యలు పరిష్కరించాలనికోరుతూ స్థానిక ఆర్ఒబి వద్ద చేపట్టిన నిరసన శిబిరం 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మిమ్స్ ఉద్యోగులు,కార్మికులు నిరసన శిబిరం నుంచి రామ తీర్థం జంక్షన్ మీదుగా మొయిద జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం, రాస్తా రోకో,ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్య నారాయణ మాట్లాడుతూ మిమ్స్ యాజమాన్యం ఉద్యోగులు, కార్మికుల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. నియంతృత్వంగా వ్యవహరిస్తూ సమస్యలపై మాట్లాడితే సస్పెన్స్ వంటి చర్యలకు దిగడం దుర్మార్గమన్నారు. అంతే కాకుండా 2011 నుంచి 2020 వరకు ప్రకటించిన డిఎ లు ఇవ్వలేదని, 2020నుంచి నేటి వరకు 7డిఎలు బకాయిలు ఉన్నాయని తెలిపారు. 2017 వరకు రెండేళ్లకొకసారి వేతన ఒప్పందం జరిగిందని, 2019లో జరగాల్సిన వేతన ఒప్పందం ఇంతవరకు జరగలేదని, ఆ వేతన ఒప్పందం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెండేళ్లు దాటిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, 2019లో వేతన ఒప్పందం కోసం పోరాటం చేసిన ఉద్యోగులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకుని, ప్రస్తుత సస్పెండ్ చేసిన ఇద్దరు ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మిమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టివి రమణ, సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు, ఉద్యోగులు మిరప నారాయణ, కె.కాము నాయుడు, వి. అప్పల నాయుడు, టి.రామకృష్ణ, ఎం. నాగభూషణం, కె.నాగేశ్వర రావు, జి.వరలక్ష్మీ, వి.భవాని, బి.బంగారు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మిమ్స్ ఉద్యోగులకు టిడిపి మద్దతు

మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల పోరాటానికి టిడిపి మద్దతు తెలిపింది. గురువారం నిరసన పోరాట శిబిరాన్ని టిడిపి నియోజక వర్గం ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, తదితర నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల పోరాటానికి టిడిపి అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కార్మికుల పోరాట నిధికి కడగల ఆనంద్ కుమార్ రూ.20వేలు, నగర పంచాయతీ 13వ వార్డు కౌన్సిలర్ మజ్జి అన్నపూర్ణ రూ.10 వేలు, 8వ వార్డు నాయకులు రెడ్డి వేణు రూ.10వేలు, గరికిపేట మాజీ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ రూ.5వేలు, చంద్రంపేట టిడిపి నాయకులు నాగేశ్వర రావు, సన్యాసప్పుడు రూ.5వేలు ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు చేతుల మీదుగా అందజేశారు.

శిబిరం వద్ద విరాళం అందజేస్తున్న బంగార్రాజు

నోడల్ అధికారుల నియామకం

విజయనగరం : వచ్చే సాధరణ ఎనికల నిర్వహణల్లో పలు రకాల విధులకు సంబంధించి జిల్లా అధికారులను నోడల్ అధికారులుగా కలెక్టర్ నాగలక్ష్మి నియమించారు. జిల్లా ఇన్ఫర్మేటిక్స్ ఆఫీసర్ ఆర్. నరేంద్ర నోడల్ ఆఫీసరు మాన్‌పవర్‌గా మొత్తం అవసరం, వారి లభ్యత, వారి డేటా పొందడం, దాని విశ్లేషణ, నియామకాలు, పోలింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ చేయడం, ముందస్తు, ఆలస్యం అయిన పోలింగ్ పర్సనల్ కోసం ఏర్పాట్లు చేయడం కోసం నియమించారు. ఎస్‌డిసి(ఎల్.ఎ) బొబ్బిలి యూనిట్ డి. ప్రమీల గాంధీని శిక్షణ నిర్వహణ నోడల్ ఆఫీసరు గా నియమించారు. డిపిఒ శ్రీధర్ రాజును వస్తు నిర్వహణ నోడల్ ఆఫీసరుగా, ఆర్‌టిఒ ఎన్. రమేష్ రవాణా నిర్వహణ నోడర్ అధికారిగా, ఎడిషనల్ జిల్లా ఇన్ఫర్మేటిక్స్ ఆఫీసర్ ఎ. బాల సుబ్రహ్మణ్యంను కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీ, ఐటి నోడల్ అధికారిగా నియమించారు. హౌసింగ్ పీడీ వి. శ్రీనివాస్‌ను స్వీప్ నోడల్ అధికారిగా, డిఎస్‌బి ఇన్‌స్పెక్టర్ కె.కె.వి. విజయనాధ్‌నును శాంతిభద్రతలు నోడల్ అధికారిగా నియమించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బి.ఉమాశంకర్‌ను ఇవిఎంల నోడల్ అధికారిగా, డ్వామా అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.అరుణశ్రీని ఎంసిసి నోడల్‌అధికారిగా, జిల్లా ఆడిట్ ఆఫీసరు బి. అరుణ కుమారిని వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారిగా, జిల్లా బిసి వెల్ఫేర్ ఆఫీసర్ కె.సందీప్‌ను బ్యాలెట్ పేపర్, పోస్టల్ బ్యాలెట్ పేపర్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ ఆఫీసర్ గా నియమించారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి డి. రమేష్‌ను మీడియా నోడల్ అధికారిగా, కమ్యూనికేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్‌ను ప్రణాళికల నోడల్ అధికారిగా, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.సుధారాణిని ఎన్నికల జాబితా నోడల్ అధికారిగా, సిపిఒ పి.బాలాజీని ఫిర్యాదుల పరిష్కారం, ఓటరు హెల్ప్‌లైన్ నోడల్ అధికారిగా, జిల్లా సివిల్ సప్లయి అధికారి కె.మధుసూదనరావును పరిశీలకుల నోడల్ అధికారిగా నియమించారు.

సిఎ ఫలితాల్లో ఆర్ఎస్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ

విజయనగరం టౌన్ : సిఎ, సిఎంఎ ఫౌండేషన్ కోర్సుల ఫలితాల్లో అర్ఎస్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. జాతీయ స్థాయి ఫలితాల్లో 75 శాతం మార్కులు దాటి విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. రెండు కోర్సుల్లో మొత్తం 12 మంది విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని అర్ఎస్ అకాడమీ డైరెక్టర్ అంట్యాకుల రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

వేలల్లో అభ్యర్థులు.. వందల్లో పోస్టులు

284 ఉపాధ్యాయ ఖాళీలకు నోటిఫికేషన్ ● ఎస్‌జిటి.. 103, ఎస్ఎ 97 పోస్టుల భర్తీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉమ్మడి విజయనగరం జిల్లాలో దాదాపు ఐదేళ్లుగా వేల సంఖ్యలో అభ్యర్థులు డిఎస్‌సి కోసం సన్నద్ధమవుతున్నారు. డిఎస్‌సి నోటిఫికేషన్ ఎప్పుడొస్తుందో అంటూ కళ్లు కాయలు కాసేలా ఎదురుచూశారు. ఐదేళ్ల సుదీర్ఘ నిరీక్షకు తెరదించుతూ అత్తెసరు పోస్టులతో ప్రభుత్వం డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసింది. వేలల్లో అభ్యర్థులుంటే, వందల సంఖ్యలో పోస్టులను ప్రకటించి, వారి ఆశలను ప్రభుత్వం అడియాసలు చేసింది. ఐదేళ్లుగా లక్షల రూపాయలు ఖర్చు చేసి డిఎస్‌సి కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులను తక్కువ పోస్టుల సంఖ్య ప్రకటించడంతో మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

రీడింగ్ రూమ్‌లో చదువుతున్న అభ్యర్థులు

మెగా డిఎస్‌సి ప్రకటిస్తామని చెప్పిన ప్రభుత్వం.. కేవలం రాష్ట్ర వ్యాప్తంగా 6100 పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. మన జిల్లాకు ఎన్ని పోస్టులోనని ఎదురు చూసిన అభ్యర్థులు.. విద్యాశాఖా మంత్రి బొత్స సత్య నారాయణ ప్రకటనతో తీవ్ర నిరాశకు గురయ్యారు. మంత్రి బొత్స ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా కాబట్టి ఎక్కువ పోస్టులు కేటాయిస్తారని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. ఉమ్మడి జిల్లాకు కేవలం 284 పోస్టులు కేటాయించినట్లు ప్రకటించడంతో అభ్యర్థులు ఉసూరుమన్నారు. అందులో ఎస్‌జిటి పోస్టులు 103, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 97 భర్తీ చేయనున్నట్లు తెలియడంతో మరింత నిర్వేదనకు గురిచేసింది. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో ఏ సబ్జెక్టుకు ఎన్ని పోస్టులో అనేది కూడా స్పష్టంగా ఇవ్వలేదు. మరోవైపు జెడ్‌పి, ప్రభుత్వ, మున్సిపాలిటీ, గిరిజన ప్రాంతాలకు ఎన్ని పోస్టులో కూడా స్పష్టంగా చెప్పలేదు. దీంతో నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థుల్లో ఆందోళన కొనసాగుతోంది.

ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య తక్కువ కావడం ఒకెత్తయితే, ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో పోస్టులు భర్తీ చేస్తారా? అనే సందేహాన్ని అభ్యర్థులు వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజుల్లో సాధారణ ఎన్నికలు నోటిఫికేషన్ రానుండటంతో డిఎస్‌సి నిర్వహిస్తారా? లేదా? అన్న సందేహాలు అభ్యర్థుల్లో వ్యక్తమవుతున్నాయి. నిజంగా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈపాటికే డిఎస్‌సి నిర్వహించాల్సి ఉంది. కేవలం ఎన్నికల కారణంగానే ఇప్పుడు నోటిఫికేషన్ ఇచ్చిందనే చర్చ సాగుతోంది.

ఐదేళ్లుగా నిరీక్షణ

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 18 వరకు బిఇడి కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల నుంచి ఏటా సుమారు 900 మంది రిలీవ్ అవుతున్నారు. మరో వైపు డైట్ కాలేజీలు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒకటి, ప్రయివేటు కళాశాలలు 8 వరకు ఉన్నాయి. ఈ కళాశాలల నుంచి ఏటా 800 మంది వరకు రిలీవ్ అవుతున్నారు. వీరు కాకుండా ఇప్పటికే బిఇడి, డిఇడి కోర్సులు పూర్తిచేసి ఉద్యోగాలు రానివారు వేలాది మంది ఉన్నారు. టిడిపి హయాంలో 2018 అక్టోబరు 25న చివరి సారిగా నోటిఫికేషన్ వెలువడగా, 2019 జనవరితో పరీక్షలు పూర్తయ్యాయి. ఆ తర్వాత ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాలు జరగలేదు. ఐదేళ్లుగా డిఎస్‌సి కోసం ఈ నేపథ్యంలో గత డిఎస్‌సికి హాజరైన వారికి రెట్టింపు సంఖ్యలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయాలి

బాలికా శిశు సంరక్షణపై విస్తృత ప్రచారం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసి, నివేదికలను ఈనెల 15వ తేదీలోగా పంపించాలని, ప్రోగ్రామ్ అధికారులను జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు కోరారు. పిసిపిఎన్‌డిటి చట్టం-1994పై జిల్లా సలహా మండలి సమావేశం డిఎంఅండ్‌హెచ్ఒ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. చట్టం అమలుకు జిల్లాలో ఇప్పటివరకు తీసుకున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్ఒ భాస్కరరావు మాట్లాడుతూ, జిల్లాలో 15 ప్రభుత్వ, 85 ప్రయివేటు స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని చెప్పారు. వీటన్నిటినీ తనిఖీచేసి, నివేదికలను ఈ నెల 15లోగా అందజేయాలని చెప్పారు. చట్టంలో పొందుపరిచిన అంశాలన్నిటినీ ఖచ్చితంగా అమలు జరిగేలా చూడాలన్నారు. స్కానింగ్ సెంటర్ ఇచ్చే బిల్లులపై లిలింగ నిర్ధారణ పరీక్షలు చట్టప్రకారం నేరం అనే వాఖ్యలను తెలుగు, ఆంగ్లంలో తప్పనిసరిగా ముద్రించి ఉండాలని తెలిపారు. స్కానింగ్ గదివద్దా, పేషెంట్లు వేచి ఉండే గది వద్ద ఐఇసి బోర్డులు, ధరల పట్టికలను ఏర్పాటు చేయాలన్నారు. బాలికా శిశు సంరక్షణపై విస్తతంగా అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో పిసిపిఎన్‌డిటి నోడల్ ఆఫీసర్ డాక్టర్ అచ్యుతకుమారి, ఉప జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎన్.సూర్యనారాయణ, పిఒఎన్ఐడి డాక్టర్ రవికుమార్, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సుజాతాదేవి, గైనకాలజిస్ట్ డాక్టర్ సుధ, నేచర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి దుర్గ, డెమో చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

విజయనగరంటౌన్ : పేదల సొంతింటి కల నెరవేర్చడమే ముఖ్యమంత్రి ధ్యేయమని మేయర్ విజయలక్ష్మి అన్నారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో 130 మంది లబ్ధిదారులకు ఇళ్లపట్టాలను అందజేశారు. ఇటీవల సారిక, జమ్ము ప్రాంతాలలో వివిధ డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. అయితే కొన్ని కారణాలవల్ల పట్టాలు అందుకునేందుకు రాలేని లబ్ధిదారులకు ఈరోజు పట్టాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళల పేరుపైనే పట్టాలను అందిస్తూ నవరత్నాల అమలులో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని అన్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చులయా యాదవ్, వైసిపి నగర అధ్యక్షులు ఆసపు వేణు, సహాయ కమిషనర్ తిరుమలరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వ్యాను బోల్తా

- మూడు ఆవులు మృతి, తొమ్మిదింటికి గాయాలు
- మిగిలిన ఆవులను పట్టుకుపోయిన స్థానికులు

బోల్తా పడిన వ్యాను, రోడ్డుపై గాయపడిన, మరణించిన పశువులు

ప్రజాశక్తి- భోగాపురం

జాతీయ రహదారిపై సరుకులతో వెళ్తున్న వాహనాలు ఏవైనా ప్రమాదానికి గురైతే పడిపోయిన సరుకులు ఎత్తుకుపోవడం విన్నాం. కానీ సుమారు 50 ఆవులతో వెళ్తున్న వ్యాను హైవేపై సవరవల్లి సమీపంలో బోల్తా పడింది. దీంతో మూడు ఆవులు చనిపోగా మరో తొమ్మిది గాయపడ్డాయి. మిగిలిన ఆవులను కొంతమంది సరుకులను పట్టుకుపోయినట్లు ఇంటికి తోలుకొని వెళ్ళిపోయారు. ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే..

శ్రీకాకుళం వైపు నుంచి అనకాపల్లి వైపు సుమారు 50 ఆవులతో బుధవారం రాత్రి వ్యాన్ బయలుదేరింది. ఇంతలో సవరవల్లి సమీపంలో గురువారం వేకుజామున డివైడర్ పైకి ఎక్కి బోల్తా పడింది. దీంతో అందులో ఉన్న ఆవులన్నీ రోడ్డుపై చెల్లచెదురుగా పడిపోయాయి. డ్రైవర్ క్లీనర్ అక్కడి నుంచి వెంటనే పరారయ్యారు. అక్కడకక్కడే మూడు ఆవులు మృతి చెందగా మరో 9 ఆవులు గాయాలతో సంఘటన స్థలం వద్ద మిగిలాయి. హైవేపై పడిన ఆవులు శ్రీకాకుళం వెళ్లే రహదారిలో తిరగడం మొదలెట్టాయి. దీంతో విశాఖ నుంచి శ్రీకాకుళం వెళ్లే రహదారిలో కొంత ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ ఆవులు సర్వీస్ రోడ్లోకి వెళ్లేందుకు అవకాశం లేదు. దీంతో సుమారు రెండు కిలోమీటర్ల వరకు సమరవల్లి సంతదాటి ముందుకు వెళ్లిపోయాయి. ఇది చూసిన కొంతమంది స్థానికులు వాటిని డివైడర్ దాటించి ఇంటికి తోలుకుపోయినట్లు తెలుస్తోంది. వెంటనే పోలీసులతో పాటు హైవే సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. చనిపోయిన ఆవులతో పాటు గాయపడిన వాటిని స్థానికులు సాయంతో బయటకు తీశారు. సంఘటన స్థలాన్ని సీఐ రవికుమార్ పరిశీలించారు.

సంఘటనపై కేసు నమోదు చేశాం

సవరవల్లి వద్ద వ్యాన్ బోల్తా పడిన సంఘటనపై కేసు నమోదు చేశాం. మూడు ఆవులు చనిపోగా మరో తొమ్మిది ఆవులు గాయపడ్డాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం.

- సిఐ రవికుమార్

చర్చలేని కౌన్సిల్ సమావేశాలు

ఎజెండా ఆమోదానికే పరిమితం ● ఇద్దరు.. ముగ్గురు చెప్పిందే వేదం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమావేశానికి వచ్చాం.. ఎజెండా చూశాం.. నాయకులు చెప్పింది విన్నాం.. బిస్కెట్‌లు తిన్నాం, టీ తాగాం.. సమావేశం అయిపోయింది.. వెళ్లిపోదాం.. అన్న చందంగా విజయనగరం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం సాగుతోంది. మొత్తం 50 మంది కార్పొరేటర్లలో 48 మంది అధికార పార్టీ వారు కావడం, ఒకరు టిడిపి, మరొకరు ఇండిపెండెంట్ కావడంతో అధికార పార్టీ నాయకులు చెప్పిందే వేదం.. చేసిందే నిర్ణయం అన్న చందంగా కౌన్సిల్ సమావేశాలు సాగుతున్నాయి. దీంతో సమావేశాలకు వస్తున్న కార్పొరేటర్లు సంఖ్య కూడా తగ్గుతూ పోతుంది. కౌన్సిల్ సమావేశం అంటే అధివృద్ధి, సమస్యలపై చర్చించడంతో పాటు, ప్రజా సమస్యలను పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లే వేదిక. కానీ కౌన్సిల్ సమావేశాలు గత మూడేళ్లగా కేవలం ఎజెండా చదవడం ఆమోదించడానికే పరిమితమవుతోంది. 50మంది కార్పొరేటర్లలో నలుగురైదుగురు మినహా మిగతా వారు ఈ మూడేళ్లలో ఒక్కసారి కూడా మాట్లాడిన పాపానపోలేదు. కనీసం తమ వార్డు సమస్యలు చెప్పుకునేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. ఒక వేళ ఎవరైనా అడిగితే వెంటనే సీనియర్ కార్పొరేటర్లు లేచి వారిని మాట్లడనివ్వకుండా సర్ది చెప్పి కూర్చోబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఎజెండా కూడా ముందుగా నిర్ణయించుకొని ఆ అంశం పట్ల ఎలా మాట్లాడాలో ముందుగానే ఆ డివిజన్ కార్పొరేటర్‌కు చెప్పి తాళాలు కొట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ప్రజాస్వామ్య యుతంగా జరగాల్సిన కౌన్సిల్ సమావేశాలు ఆ దిశగా జరగడం లేదు. కౌన్సిల్ ఏర్పడిన తర్వాత నగరాభివద్ధి మీద ఒక్క సమావేశంలో కూడా చర్చ జరగలేదు అంటే కౌన్సిల్ సమావేశాలు ఏ విధంగా జరుగుతున్నాయో అర్థమవుతుంది. సమావేశాల్లో ఎటువంటి చర్చ లేకపోయినా ఎమ్మెల్యే చొరవతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇదే పద్ధతి కొనసాగితే ఎన్నికైన పాలకవర్గ సభ్యులు ఉత్సవ విగ్రహాలు మాదిరిగా ఉండటం, చెప్పింది చేయడం తప్ప సొంత ఆలోచనలకు, నిర్ణయాలకు తావు లేకుండా పోతుంది. గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశం అందుకు నిదర్శనంగా నిలిచింది.

11.30 గంటలకు సమావేశం ప్రారంభమై అర్ధ గంటలో ఎజెండా చదవడం,ఆమోదించడం సమావేశం ముగించడం అయిపోయింది. ఇలా ఉంటే పాలక వర్గం సభ్యులు ఎప్పుడు సమావేశాల చర్చల్లో పాల్గొంటారు, వారి అభిప్రాయాలను వెల్లడించగలరని పలువురు చర్చించుకుంటున్నారు.

11 అంశాలతో కూడిన అజెండాకు ఆమోదం

మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం సాదాసీదాగా జరిగింది. సమావేశంలో 11 అంశాలతో కూడిన అజెండాను ఆమోదించారు. ముందుగా కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన ఎం.మల్లయ్య నాయుడు, సహాయ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సిహెచ్ తిరుమలరావు సభకు పరిచయం చేసుకున్నారు. అందరి సహకారంతో నగరాన్ని అభివృద్ధి చేసేందుకు శాయశక్తుల కృషి చేస్తామని అధికారులు వెల్లడించారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గతం కంటే ప్రస్తుతం నగరం అనేక విధాలుగా అభివద్ధి చెందిందన్నారు. అంబేద్కర్ భవనాన్ని రూ.39లక్షల 90 వేల వ్యయంతో నిర్మించేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ మాట్లాడుతూ ఆనంద గజపతి ఆడిటోరియం నిర్వహణ నగరపాలక సంస్థకు గుదిబండగా కాకుండా చూడాలని అన్నారు. కోఆప్షన్ సభ్యులు ఆశపు వేణు, కార్పొరేటర్ రేగాన రూప దేవి మాట్లాడుతూ అంబేద్కర్ సామాజిక భవనాన్ని ఆధునిక హంగులతో నిర్మించేందుకు నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయా యాదవ్ పాల్గొన్నారు.



సభ్యుల గైర్హాజరుతో ఖాళీగా ఉన్న సీట్లు

ప్లాస్టిక్ నివారణకు పటిష్ట చర్యలు

మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో ప్లాస్టిక్ నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఎల్.రామలక్ష్మి చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధం అమలు చేసినా, అక్కడక్కడ వినియోగం కనిపిస్తోందన్నారు. ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు అమ్మినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్లాస్టిక్ నివారణపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. సంపూర్ణ పారిశుధ్య నిర్వహణ చేస్తామన్నారు. పట్టణంలో ఇంటింటి నుంచి తడి, పొడి చెత్త సేకరణ చేస్తున్నట్లు వెల్లడించారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణకు ప్రభుత్వం ఛార్జింగ్ వాహనాలను మంజూరు చేసిందని, ఎమ్మెల్యేతో ప్రారంభించి వినియోగంలోకి తీసుకొస్తామని చెప్పారు.

అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సర్వీసు రూల్స్ పరిష్కారం కోసం ఎపి అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను పునరుద్ధరణ చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.జోగినాయుడు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సర్వీసులో అన్యాయం చేస్తే అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తే త్వరగా న్యాయం జరిగేదని చెప్పారు. అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను రద్దు చేయడంతో సర్వీసు రూల్స్‌లో అన్యాయం జరిగిన వారికి త్వరగా న్యాయం జరగడం లేదని తెలిపారు.

ఇంటింటి ప్రచారం చేస్తున్న వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ తలే రాజేష్

'మాది పేదల ప్రభుత్వం'

ప్రజాశక్తి- రేగిడి

వైసిపి ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వం అని రాజాం నియోజకవర్గం వైసిపి ఇన్చార్జి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. గురువారం సరసనాపల్లి జోడుబందల, కందిశ, తునివాడ, వెంకంపేట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. అనంతరం కందిశ, తునివాడ, హరసనపల్లి గ్రామాల్లో టిడిపి నుంచి కొంత మంది వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు వావిలపల్లి జగన్మోహనరావు, టంకాల అచ్చెంనాయుడు, సురేష్, వి. చక్రపాణి, కెల్ల మన్మధరావు, వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సేవలపై అవగాహన

ప్రజాశక్తి - వంగర

అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల తోపాటు గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎపిఎం మీసాల చక్రపాణి అన్నారు. ఈ మేరకు మాత శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అరసాడలో గురువారం జమికుల బుర్రకథ రూపంలో అంగన్వాడీ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, మహిళలు, వెలుగు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపిపి సత్యవంతుడు, తదితరులు

నేడు డి వార్మింగ్ డే

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో శుక్రవారం నిర్వహించే డి వార్మింగ్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిపి డి.సత్యవంతుడు కోరారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో డివార్మింగ్ డే పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. డివార్మింగ్ ప్రాధాన్యతను వైద్యాధికారులు ధరణి, రమాదేవి వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈర్లే సన్యాసినాయుడు, తహశీల్దార్ ప్రసన్నకుమార్, పిహెచ్‌సి సిహెచ్‌ఒ ఆంజనేయులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

స్థానిక పిహెచ్‌సిలో గురువారం గర్భిణులకు వైద్యులు ధరణి పరీక్షలు చేశారు. 38 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. వీరికి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన భోజన సదుపాయం కల్పించారు.

స్త్రీనిధి రుణాలు రికవరీ తప్పనిసరి

ప్రజాశక్తి- రేగిడి

స్త్రీనిధి రుణాలు రికవరీ తప్పనిసరి చేయాలని ఎజిఎం ఎ.ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక వైకెపి కార్యాలయంలో విఒఎలు, మండల మహిళా సంఘ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన సంఘాలకు బ్యాంకుల ద్వారా స్త్రీనిధి రుణాలు అందజేశామన్నారు. స్త్రీనిధి రుణాలు బ్యాంకుల ద్వారా తీసుకున్న మహిళా సంఘ సభ్యులు చిన్న తరహా వ్యాపారాలు పెట్టి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. స్త్రీనిధి రుణాలు తీసుకున్న వారు బ్యాంకులకు తప్పనిసరిగా కట్టాలన్నారు. ఏ సంఘ సభ్యులు కట్టని ఎడల వారికి తిరిగి బ్యాంకులు ద్వారా రుణాలు అందజేయలేమన్నారు. సమావేశంలో ఎపిఎం బి. గోవిందరావు, సీనియర్ మేనేజర్ వి. సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, హైస్కూల్ ప్లస్‌లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభిస్తున్నట్లు ట్రెయినీ మాస్టర్లు పొట్నూరు శివాజీ, టి.రాజేష్ తెలిపారు. ఆ పాఠశాలలో గురువారం హెచ్‌ఎం బి.ఉమామహేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో 70 మంది విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.జయ, ఎస్‌విఎస్‌ఎన్ మూర్తి, కృష్ణంరాజు, ఎల్.వి.సత్యనారాయణ, లోకిరెడ్డి కృష్ణ పాల్గొన్నారు.

క్రీడా విజేతలకు అభినందన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో నియోజకవర్గ, జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు అభినందన కార్యక్రమాన్ని గురువారం స్థానిక థామస్ పేట ఫుట్ బాల్ మైదానంలో నిర్వహించారు. ఇటీవల ఆడుదాం ఆంధ్ర క్రీడా కబడ్డీ పోటీల్లో నగర పంచాయతీకి చెందిన పురుషుల జట్టు నియోజక వర్గ స్థాయిలో ప్రథమ స్థానం, మహిళల జట్టు ప్రథమ స్థానం, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించగా పురుషుల జట్టు ద్వీతీయ స్థానం సాధించింది. వీరిని పట్టణ వైసిపి అధ్యక్షులు, కో ఆప్షన్ సభ్యులు చిక్కాల సాంబశివరావు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజినీ, వైస్‌చైర్మన్‌లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ అభినందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ పీడీ బొమ్మన రామారావు, రోడ్లు, భవనాల కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్. శ్రీనివాస రావు, నెల్లిమర్ల కబడ్డీ సంఘం అధ్యక్షులు బోని సూర్య నారాయణ, పిఇటి ఎన్. సూర్య నారాయణ, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఇటు గందరగోళం.. అటు కుమ్ములాట

టిడిపిలో అసమ్మతికి అధిష్టానం ఆజ్యం

వైసిపిలో అసమ్మతి ఉన్నా కడుబండికి లైన్ క్లియర్

ఝాన్సీలక్ష్మితో అసమ్మతికి చెక్ పడేనా..!

ప్రజాశక్తి - జామి

శృంగవరపుకోట నియోజకవర్గంలో వైసిపి, టిడిపిలో వేరు కుంపట్లు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. వైసిపి అధిష్టానం సిట్టింగ్‌కే సీటు అని స్పష్టం చేస్తున్నా.. స్థానిక నేతలు కొందరు జిల్లా నేతల ప్రోద్బలంతో వ్యతిరేక స్వరం వినిపిస్తున్నారు. మరోవైపు టిడిపిలో మాత్రం విచిత్ర పరిస్థితి నెలకొంది. అధిష్టానమే ఇద్దరు నేతలను ప్రోత్సహించడంతో అసమ్మతి పురుడుపోసుకుంది. దీంతో వారిద్దరూ వేర్వేరు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చంద్రబాబు ద్వంద వైఖరి వల్లే గ్రూపులు తయారయ్యాయన్న వాదన వినిపిస్తోంది. మరో రెండు నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార పార్టీలో అసమ్మతిని దారిలోకి తెచ్చుకుంటే తమకు తిరుగుండదన్న ధీమాలో ఆ పార్టీ నాయకులు ఉన్నారు. అభ్యర్థి ఎవరో తేలిక టిడిపిలో అయోమయం నెలకొంది. ఒకవేళ అభ్యర్థిని ఖరారు చేస్తే రెండో గ్రూపు సహకరిస్తుందా! లేదా? అన్న సందేహం నెలకొంది. మొత్తానికి ఎస్. కోట రాజకీయం ఎన్నికల ముందే వేడెక్కింది.

అధికార పార్టీ అధిష్టానం సర్వే రిపోర్టు, సామాజిక సమీకరణాలు ఆధారం చేసుకుని టిక్కెట్లు కేటాయిస్తున్న సంగతి తెలిసిందే. సిట్టింగ్ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు టిక్కెట్ ఇస్తే సహకరించేది లేదని, స్థానికుల్లో ఒకరికి ఇవ్వాలని ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు, వెలమ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నెక్కల నాయుడుబాబు పట్టుబట్టినా సిఎం జగన్ వాటిని లెక్కచేయడం లేదు. పనితీరు ఆధారంగా, అధినేత వద్ద ఆశీస్సులు ఉన్న కడుబండి శ్రీనివాసరావుకే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అసమ్మతి స్వరం వినిపిస్తున్న రఘురాజు మంత్రి బొత్సతో అనుంగ శిష్యుడిగా ఉన్నారు. నాయుడుబాబు చిన్న శ్రీనుతో సన్నిహితంగా మెలుగుతున్నారు. విశాఖ పార్లమెంటు అభ్యర్థిగా మంత్రి బొత్స సతీమణి ఝాన్సీలక్ష్మిని వైసిపి ప్రకటించడంతో అసమ్మతికి చెక్ పడుతుందని కడుబండి గ్రూపులు ఆశ భావంతో ఉన్నారు. ఇప్పటికే మంత్రి బొత్స సత్యనారాయణ ఎమ్మెల్యే కడుబండి, ఎమ్మెల్సీ రఘురాజును పిలిపించి ఐదు మండలాల నాయకులతో చర్చలు జరిపారు. ఇద్దరి మధ్య దూరం పెరగడానికి గల కారణాలను తెలుసు కుని భవిష్యత్‌లో అలా జరగకుండా చూసుకోవాలని నచ్చ చెప్పినట్లు సమాచారం. మంత్రి బొత్స సత్యనారాయణ సీరియస్‌గా తీసుకుంటే ఎమ్మెల్సీ వెంట ఉన్న కేడర్ పార్టీకి వ్యతిరేకంగా పని చేసే పరిస్థితి ఉండదన్న ధీమాలో కడుబండి గ్రూపు నాయకులు ఉన్నారు.

టిడిపి అభ్యర్థి ఖరారైతే అసమ్మతి చల్లారుతుందా?

నియోజకవర్గంలో టిడిపి టిక్కెట్ ఆశిస్తున్న కోళ్ల లలిత కుమారి, గొంప కృష్ణ ఎవరికి వారిగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గొంప కృష్ణ అందరిని కలుపుకొని పనిచేసేందుకు ప్రయత్నించినా లలితకుమారి గ్రూపు అంగీకరించలేదని సమాచారం. కోళ్లకు సీటు ఇచ్చినా తాను పార్టీ గెలుపుకోసం కృషి చేస్తానని గొంపకృష్ణ చెబుతున్నా ఆయన వెంట ఉన్న అనుచరులు ఆమె పై ఆగ్రహంతో ఉండటం గమనార్హం. ఒక వేళ గొంప కృష్ణకు సీటు దక్కితే కోళ్ల కుటుంబం సహకరిస్తుందా..! లేదా అన్న సందేహాలు ఆ పార్టీ నాయకుల్లో వ్యక్తమవుతున్నాయి. విశాఖ పార్లమెంట్ స్థానంనుంచి టిడిపి అభ్యర్థిగా భరత్ పోటీ చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో తెలుగు తమ్ముళ్ల కుమ్ములాటలు ఏవిధంగా సర్దుకుంటాయి? ఎలా అధికార పార్టీని ఎలా ఎదుర్కొంటారు అన్నది వేచి చూడాల్సిందే.

16న రవాణా రంగం బంద్

ప్రజాశక్తి-బొబ్బిలి

మోడీ, జగన్ ప్రభుత్వాల దుర్మార్గమైన విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న రవాణారంగం బంద్ చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, లైట్ వెహికల్ వాహనాల సంఘం అధ్యక్షులు ఆల్తి కృష్ణ తెలిపారు. బంద్‌ను విజయవంతం చేయాలని గురువారం పట్టణంలోని ఆటోస్టాండ్ వద్ద ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్ల మెడకు మోడీ ప్రభుత్వం ఉరితాడు బిగిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఐపిసి 304 (ఎ)లో రెండేళ్ల నుంచి ఏడేళ్ల శిక్షలు విధించడం దారుణమన్నారు. పెట్రోల్ ఛార్జీలు భారీగా పెంచి రవాణా రంగాన్ని జగన్ ప్రభుత్వం నిలువునా ముంచేస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. రవాణా రంగాన్ని దెబ్బ కొట్టి కార్పొరేట్లకు అప్పజెప్పడానికి కుట్రపన్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కార్మికులు లక్ష్మణ, బిటిఆర్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ముగ్గురు విద్యార్థులు

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

గుజరాత్‌లో ఈ నెల 22 నుంచి జరిగే జాతీయ సాఫ్ట్ బాల్ పోటీలకు ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు పారాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ ఎన్.వెంకటనాయుడు తెలిపారు. జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలలో సుప్రియ, తేజస్విని, చైతన్య పాల్గొననున్నారు. ముగ్గురు విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

పాఠశాల సందర్శన

వేపాడ : మండలంలోని సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను గురువారం ఎంఇఒ పి.బాలభాస్కరరావు సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షను పర్యవేక్షించారు. పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బిపిఎ రాజు పాల్గొన్నారు.

కొత్తవలస రైల్వేస్టేషన్లో నిలిచిన అరకు రైలు

ఆందోళనకు దిగిన ప్రయాణికులు

ప్రజాశక్తి-కొత్తవలస

చిమిడిపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో కొత్తవలస రైల్వే స్టేషన్లో విశాఖ - కిరండోలు పాసింజర్‌రైలు మధ్యాహ్నం 12 గంటల వరకు నిలిచిపోయింది. దీంతో అరకు అందాలు చూసేందుకు వెళ్లిన ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. చిమిడిపల్లి రైల్వేస్టేషన్ వద్ద పట్టాలు తప్పిన గూడ్స్ రైలును పునరుద్ధరించడానికి రైల్వే శాఖ హుటా హుటినా సహాయక చర్యలు చేపట్టింది. అరకు అందాలు చూసేందుకు ఆంధ్ర, తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్, ఒడిశాకు చెందిన పర్యాటకులు నిత్యం వందలాది మంది ప్రయాణికులు విశాఖ కిరండోల్ పాసింజర్ రైలులో వెళ్తుంటారు. ఈ మార్గం గుండా వెళ్తే అరకు అందాలతో పాటు శివలింగాపురం నుండి అరకు చేరుకునేంతవరకు ఉన్న గృహలు, కొండలు, లోయలు అందాలను ఆస్వాదించవచ్చు అనే ఉద్దేశంతో ప్రయాణం చేస్తూ ఉంటారు. కానీ గురువారం ఉదయం విశాఖ రైల్వే స్టేషన్ నుండి బయలుదేరిన విశాఖ కిరండోలు పాసింజర్ రైలు కొత్తవలస సమీపానికి వచ్చేసరికి రైల్వే శాఖ నుండి ప్రయాణికులకు ఒక చేదువార్త వినిపించింది. చిమిడిపల్లి రైల్వే స్టేషన్ వద్ద గూడ్స్ రైలు ప్రమాదానికి గురవ్వడంతో ఈ రైలును కొత్తవలస రైల్వే స్టేషన్లోనే నిలిపి వేస్తున్నట్లు తెలపడంతో స్టేషన్ మాస్టర్ ఆఫీస్ వద్దకు ప్రయాణికులు చేరుకొని ఆందోళన చేశారు. రైలు ప్రమాదం ఉదయం జరిగితే ఇప్పటివరకు తమకు సమాచారం ఎందుకు ఇవ్వలేదని, ముందుగానే సమాచారం ఇస్తే విశాఖ నుంచి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటాం కదా అని ప్రశ్నించారు. రైల్వే శాఖ వైఫల్యానికి మమ్మల్ని ఇబ్బందులకు గురి చేయటం ఎంతవరకు సమంజసమని ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ఆర్‌పిఎఫ్ సిబ్బంది, స్టేషన్ మాస్టర్ ఎంత సర్ది చెప్పినా ప్రయాణికులు వినకపోవడంతో పై అధికారులతో చర్చించిన స్టేషన్ మాస్టర్ రైలును ముందుకు పంపిస్తున్నట్లు అనౌన్సు చేయడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

స్టేషన్ మాస్టర్ గది వద్ద గుమిగూడిన ప్రయాణికులు

ఇది కోతల ప్రభుత్వం

ప్రజాశక్తి-విజయనగరంకోట

పేదలకు ఒక వైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం మరోవైపు భారీగా ఏటాకోతలు పెడుతోందని టిడిపి నాయకులు దుయ్యబట్టారు. గురువారం రాత్రి దుప్పాడలో జయహో బిసి కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతి మాట్లాడుతూ బాబుష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను వివరించారు. ఈ ప్రభుత్వం ప్రజలకు ఏదో చేస్తున్నట్లు నటిస్తుందే తప్ప చేసేది ఏమీ లేదన్నారు. ప్రజలపై అనేక భారాలు వేస్తున్నారన్నారు. ప్రభుత్వంలో నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. సర్పంచ్ వ్యవస్థను సర్వనాశనం చేస్తారన్నారు. మండల పార్టీ కార్యదర్శి గంటాపోలినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు,పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు , రాష్ట్ర బిసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి వేచలపు శ్రీనివాసరావు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు,కంది మురళి నాయుడు,కనకల మురళీమోహన్, కె.శ్రీనివాసరావు, ముద్దాడ చంద్రశేఖర్, మహిళా పార్లమెంట్ అధ్యక్షులు అనురాధ బేగం, జనసేన మండల పార్టీ అధ్యక్షులు బొబ్బాది చంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : టిడిపితోనే బీసీల అభివృద్ధి సాధ్యమని నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో జయహో బిసి కార్యక్రమాన్ని నెల్లిమర్లలో నిర్వహించారు. బంగార్రాజు మాట్లాడుతూ టిడిపి హయాంలో బీసీల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని, ప్రస్తుత ప్రభుత్వం బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకొని పక్కన పెట్టిందని అన్నారు. కార్యక్రమంలో ఇచ్చాపురం నియోజకవర్గ పరి శీలకులు సువ్వాడ రవిశేఖర్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి దుమ్ము అశోక్, పార్లమెంట్ రజక సాధికార కన్వీనర్ గురజాపు రాము, పార్లమెంట్ రెడ్డిక సాధికార సమితి కన్వీనర్ నీలాపు అప్పలరామి రెడ్డి, నగర పంచాయతీ టిడిపి అధ్యక్షులు బైరెడ్డి లీలావతి, క్లస్టర్ ఇంఛార్జిలు గేదెల రాజారావు, అట్టాడ శ్రీధర్, పార్లమెంట్ కార్యదర్శి లెంక అప్పలనాయుడు, నాయకులు అవనాపు సత్యనారాయణ, కాళ్ల రాజశేఖర్, 13వ వార్డు కౌన్సిలర్ మజ్జి అన్నపూర్ణ కార్యకర్తలు, యువత తదితరులు పాల్గొన్నారు.

దుప్పాడ సభలో అభివాదం చేస్తున్న టిడిపి నాయకులు

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం రహదారి భద్రత పై విద్యార్థులకు పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు, రవాణాశాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి ఆర్. గోవిందరావు మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ప్రజలంతా రహదారి భద్రత పాటించాలని సూచించారు. విద్యార్థులు వేగ నియంత్రణతో వాహనాలు నడిపితే రహదారి ప్రమాదాల నివారణ జరుగుతుందన్నారు. వాహనాలు నడిపినప్పుడు హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. సత్య నారాయణ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె. రవిశంకర్ ప్రసాద్, రహదారి భద్రత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఎం.అప్పారావు, కమిటీ సభ్యులు డి.శ్రీరామూర్తి, రిటైర్డు ఎఎస్ఐ ఆర్లె కృష్ణ, ఎంఇఒ విజయ్ కుమార్, ఎన్ఎస్ఎస్ పిఒలు ఎస్.రమణ, ఎల్. సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి గోవిందరావు

బాలికా సాధికారతే బిబిజి లక్ష్యం

ప్రజాశక్తి-వేపాడ

బాలికా సాధికారతే బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ (బిబిజి) లక్ష్యమని ఆ సంస్థ ఎమ్‌డి మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న గురుకులంలో బిబిజి బృందం ఆధ్వర్యాన ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిన్నతనం నుంచి నాయకులుగా ఎలా ఎదగాలి, ఎలా చదువుకోవాలి, గురువును ఎలా గౌరవించాలి, ఎలాంటి వారితో స్నేహం చెయ్యాలి, జీవితంలో ఎదురైన సమస్యలను ఎలా ఎదుర్కోవాలి, ఆరోగ్యం ఎలా కాపాడుకోవాలి వంటి అంశాలపై లైఫ్, సాఫ్ట్ స్కిల్స్ నిపుణులు ఇరోతి సతీష్‌కుమార్, లక్ష్మీశంకర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపల్ ఫ్లోరెన్స్, వైస్ ప్రిన్సిపల్ ఉషారాణి పాల్గొన్నారు.

విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న బిబిజి ప్రతినిధి

బుగ్గన బడ్జెట్.. అంకెల గారడీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట, విజయనగరం కోట

ఆర్థిక మంత్రి బుగ్గన బడ్జెట్ అంతా అంకెల గారడీనేనని ఎస్.కోట, విజయనగరం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జులు కోళ్ల లలితకుమారి, పి.అదితి గజపతిరాజు అన్నారు. గురువారం వారు ఎస్.కోట, విజయనగరంలో విలేకర్లతో మాట్లాడారు. బుగ్గన బడ్జెట్ అంచనాలు కొండంత, ఖర్చులు పిసరంతలా ఉన్నాయని ఎద్దేవాచేశారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలు ఏమీ లేవన్నారు. అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా జగన్ అండ్ కో మార్చారని ధ్వజమెత్తారు. వైసిపి హయాంలో తీసుకువచ్చిన ప్రతీ స్కీమ్ ఓ స్కామ్‌గా మారిందని ఆరోపించారు. బడ్జెట్ లో పన్నుల బాదుడు తప్ప కొత్త అంశాలు ఏమీ లేవని అన్నారు. ప్రస్తుతం ఏపీ అప్పులు రూ.11.58 లక్షల కోట్లు గా ఉన్నాయని, 2019 నాటికి తెలుగుదేశం ప్రభుత్వం తీసుకున్న దానికంటే 4 రెట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్ర ప్రదేశ్ గా మార్చారని విమర్శించారు. సమావేశంలో టిడిపి మండల, పట్టణ అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, కె.మల్లేశ్వరరావు, మాజీ వైస్ ఎంపిపి నానిగిరి రమణాజీ, ఉపాధ్యక్షులు సరిపల్లి రామకృష్ణ, పొట్నూరు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం

ప్రజాశక్తి-బొండపల్లి

జగనన్న లేఅవుట్లలో ఉన్న ఇళ్ల నిర్మాణాల రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలని ఎంపిపి చల్ల చలంనాయుడు కోరారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ ఎస్.హరిహరరావు అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న ఇళ్ల నిర్మాణాలను చేపట్టిందన్నారు. నిర్మాణాలు పూర్తి అయిన వాటికి సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టిందని అన్నారు. వీలైనంత త్వరగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని అయన కోరారు. వ్యవసాయ అధికారి మల్లికార్జున రావు మాట్లాడుతూ ఖరీఫ్‌లో 13,500 టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, 10,156 టన్నులు రైతుల వద్ద నుండి సేకరించామని తెలిపారు. 90 శాతం ఇకెవైసి పూర్తి చేసినట్లు చెప్పారు. ధాన్యం దిగుబడి తక్కువ ఉన్న ఐదు గ్రామాలకు సంబంధించి రైతులకు రాయితీ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. మండలంలో 17 సచివాలయాలకు 13 సచివాలయ భవనాలు ప్రారంభించామని పంచాయతీరాజ్ జెఇ కృష్ణమూర్తి తెలిపారు. మరో నాలుగు సచివాలయాల నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉందని చెప్పారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి దుర్గాప్రసాద్, తహశీల్దార్ పి.హరి, ఐసిడిఎస్ పిఒ ఉమాభారతి, ఎపిఎం సులోచన దేవి, ఎపిఒ బి.కృష్ణవేణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి చల్ల చలంనాయుడు

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

మెంటాడ : తాగునీటి ఎద్దడినివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ లక్ష్మీభాయి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఎంపిడిఒ లక్ష్మీబాయి పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా గ్రామ, మండల స్థాయి అధికారులు చేపట్టిన పనులు, ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని, గృహనిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ చూపించి నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. గ్రామానికి అవసరమైన పనుల విషయంలో ప్రాధాన్యత బట్టి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కులగణన, ఆరోగ్యశ్రీ కార్డులు, తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి విమలకుమారి, జూనియర్ సహాయకులు సంతోష్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - భోగాపురం

గడ్డి మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి బుధవారం రాత్రి మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.. భోగాపురం గ్రామానికి చెందిన ఆళ్ల కన్నారావు(57) అధిక సమస్యలతో బతుకుపై విరక్తి చెంది బుధవారం ఇంట్లో గడ్డి ముందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే విజయనగరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించడంతో ఎస్ఐ సూర్యకుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - భోగాపురం

పేకాట శిబిరంపై బుధవారం రాత్రి పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని పట్టుకున్నారు. వీరివద్ద నుంచి రూ.19,320 స్వాధీనం చేసుకున్నామని సీఐ రవికుమార్ తెలిపారు. మండలంలోని పోలిపల్లి సమీపంలో లేఔట్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి పట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

55 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-రామభద్రపురం

ద్విచక్రవాహనంపై తరలిస్తున్న 55 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని కనిమెరక వీధికి చెందిన వ్యక్తి కోటశిర్లాం దరి ఏడొంపుల గెడ్డవద్ద ద్విచక్ర వాహనంపై మద్యం సీసాలను బెల్టుషాపునకు తరలిస్తూ పట్టుబడ్డాడు. మద్యం సీసాలు, వాహనం సీజ్ చేసి, ఆయనపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. దాడుల్లో ఎఎస్ఐ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.